శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు

ఎండ

ఎండ పేల్చేస్తోంది.

ఎండ వాయించేస్తూ వుంది.

ఎండ దంచేస్తూ వుంది.

* * *

వెచ్చటిగాలి ఆవిర్లు గ్రక్కుతూ వుంది. జీవుళ్లు అల్లాడుతు వున్నయి.

'అబ్బ' అనుకున్నాడు అబ్బయ్య.

'అబ్బబ్బా' అని ఆపసోపాలుపడ్డాడు, అబ్బయ్య. ఊపిరాడనట్లుగా, ఉక్కిరి బిక్కిరి అయిపోయినట్లుగా, అల్లాడిపోయాడు అబ్బయ్య. మెలికలు తిరిగిపోయి తెగరొప్పాడు.

'అయ్యో' అంటూ బాధకి లోనయాడు.

'అబ్బా' అని మూలిగాడు.

'అమ్మా' అనుకుని ఆక్రోశించాడు.

* * *

కరెంటు ఆగిపోయింది.

ఎయిర్కండిషనర్ చచ్చిపోయింది.

గాలి వేడెక్కింది. ఉక్కిరిబిక్కిరి చేసివేస్తూఉంది. వళ్ళు బిగిసిపోయింది. వంటిమీద చెమట్లు ధారలుగా కారాయి-ఆవిర్లయిపోయాయి.

'అమ్మమ్మ' అనుకుంటూ, కరెంటునీ, కరెంటువాళ్ళనీ తెగతిట్టుకున్నాడు, కోటీస్రావు.

'నేను, చచ్చిపోతానేమోరా, నాయనా' అనుకుని గిలగిల్లాడాడు, ఇట్లా ఈ కరెంటు వాళ్ళు ఎంతమందిని చంపేస్తారోగదా! అని జాలి కూడా పడ్డాడు.

పేట్రేగి పోతున్న ఈ ఎండలు, చీటికీమాటికీ ఆగిపోయి అజాపజాలేకుండా పోతున్న ఈ కరెంటు! ఈ ప్రపంచం కాలి, మాడి మసయి పోతుందేమోరా దేవుడా అనుకుంటూ, తెగ యిదయి పోయాడు కోటీస్రావు.

* * *

ఆ ఒక్కచెట్టూ మోడులాగఅయింది. ఆకులు రాలిపోయాయి. కొమ్మలుఎండి గిడసబారినట్లుగా అయాయి. ఆ చెట్టుక్రింద ఇంత చల్లదనాన్ని అందించే బారెడు నీడకోసం వెతుక్కుంటూ, అల్లల్లాడాడు అబ్బయ్య. ఆ నీడకోసమే వెతుకులాడుతూ, ఎండకి రొప్పుతూ, చొంగలు గార్చుకుంటూ, అటుగా వచ్చి నిలబడింది ఒక గజ్జికుక్క. పిచ్చి ముండ.

ఛీ ఛీ అనుకున్నాడు అబ్బయ్య.

ఛో ఛో అని అదిలించాడు - అక్కడినించి ఆ కుక్క కదలకపోగా, ఒక మాంచి పలుకురాయిని తీసుకుని నడుం విరిగేటట్టు కొట్టాడు. కుయ్యోమంటూ, పరుగు లంకించుకుంది కుక్క.

'నీయమ్మ ! తిక్కకుదిరిందా?' అని అథార్టీగా, ఆ నీడలో సర్దుకున్నాడు అబ్బయ్య. గర్వంగా నలుదిక్కులా పరికించి చూసాడు.

* * *

సరిగ్గా సమయానికి ఫోను కూడా మొరాయించింది. అలో-హలో అని పిలవగా చివర్కి అది పనిచెయ్యటం ప్రారంభించగా-అవతల్నించి ఎంగేజుడు అన్న కూతలు వినవచ్చాయి. ఎంతసేపూ అవే కూతలు!

'ఛీ... నీయమ్మ. ఇక ఈ దేశం బాగుపడదు. ఎటు బట్టుకుని చూద్దామన్నా అంతా డిసార్డరే!' అని ఆశ్చర్యపోయాడు, ఆ పట్నంలో రెండు సినిమాహాల్సుకీ, నాలుగు పేద్ద వ్యాపారాలకీ అధిపతి అయిన కోటీస్రావు. ఇంటావిడ వూటీకి పోయింది. కొడుకులిద్దరూ కేష్మీరు వెళ్ళారు. ఈ ఆస్తిపాస్తులకి ఇక్క కుక్క కాపలా కాస్తూ కోటీస్రావు మిగిలి పోయేడు, ఈ ఎండల్ని పుష్కలంగా భారీగా అనుభవిస్తూనే!

* * *

అబ్బ !

అబ్బబ్బ !!

ఎండ వాయించేస్తూ వుంది !!!

* * *

ఏంట్రానాయనా !

ఈ ఎండకి మనసులేదా?

ఈ వడగాలికి జాలిలేదా ?

ఈ సూరీడుకి బుద్ధిలేదా ?

ఏమిటిది ?

ఇది ఏమిటి అని !

అసలు మనుషులు బ్రతకాల్నా వద్దా అని ! ఈ చెట్టూ చేమలు ప్రాణాలు నిలుపుకుని మళ్ళీ వచ్చే వసంతానికి చివురులు వేస్తాయా, అని!

బాబో !

భగమంతుడా !

నాయనా !

పిచ్చి నాయనా !

నేను సచ్చిపోతన్నానురా ! మూడు దినాల్నుండీ తిండి లేక పోయినా భరించాను. ఒక మొండి బండముండా కొడుకులాగా నిలబడ్డాను. బ్రతగాల్ననే తాపత్రయంతోనే 'అమ్మా ఆకలి' అని ఆక్రోశించాను. ఛీ ఫో అన్న ఎన్నో ఛీత్కారాల్నీ భరించాను. ఎలాగో లాగా ఆ ఎంగిలి ముద్దల్నయినా, ఆ ఆకూ అలముల్నయినా, ఆ పంపు నీళ్ళనయినా ఆ కడుపులో పడవేసి, ఇట్లా నిలబడటానికి ప్రయత్నించానా—

ఏమిటీ ఎండా ! ?

నిలుపునా జీవుల్ని చంపటమే దీని ఇదా? ! దీనెమ్మ. ఫా! పఫా.

* * *

అబ్బా!

అమ్మా!

ఏవిటీగుండె! ఇదేమి గుండెరా నాయనా? ఒకటే ఇదిగా దడదడా దడదడా కొట్టుకుంటూ వుందే! ఏమయిపోదామనీ?!

లబాడబా

లబాడబా

డబాలబా

డబాలబా

ఏమిటని! ఆగిపోదుగదా! అమ్మో ! ఇంకేమయినా వుందా ? అంతపనీ జరుగదుగదా కొంపదీసి ! అలాగే అయితే ఇక రక్షించే నాథుడెవరూ?

ఇక లాభంలేదు. బాల్చీ తన్నదుగా వెధవప్రాణం!

ఏదో ఒకటి చెయ్యాలి. చెయ్యాల్చెయ్యాలి.

ఆ ఘోరమే జరిగితే- ఈ చుట్టూ వున్నవాళ్ళు సామాన్యులు కాదుగదా!

ఆ స్వంతబామ్మర్ది ఆ సినిమాహాళ్ళని స్వంతం చేసేసుకుంటాడు. ఆపార్ట్నర్లు దొంగలెక్కలు రాసిపారేసి, తనపెళ్ళాం బిడ్డల నెత్తిన చేతులు పెట్టేస్తారు! రాస్కెల్సు! అందువలనా,

తను పోకూడదు! పోనే పోకూడదు.

తను పోకుండా వుండాలంటే-

ఏదో ఒకటి చెయ్యాలి. చెయ్యాల్తప్పదు మరి!

తప్పదు... తప్పదు మరి.

అబ్బా! అమ్మా!

ఎండ !

వేడి, ఉక్క, ఊపిరాడని స్థితి!

పాడు గుండె లబడబ డబలబ

స్వామీ...

దేవాదిదేవా! అనాథరక్షకా! ఆర్తత్రాణ పరాయణా.

నీదగ్గరకు వచ్చి నిలువుదోపిడీ ఇస్తాను. కొల్చుకుంటాను. పూజలు చేస్తాను.

రక్షించు నన్ను.

రక్షించు నా కుటుంబాన్ని.

కాపాడు నన్నూ, నా భార్యాబిడ్డల్నీ, నా ఆస్తిపాస్తుల్నీ, నా అన్నిండినీ.

నా చిన్నిపొట్టకు శ్రీరామరక్ష. సర్వే జనా సుఖినో భవంతు !

అబ్బా !

అమ్మా !

ఏమిటీ ఆయాసం !

సమయానికి, ఇంట్లో ఎవరూ లేకుండా పోయారు గందా ఖర్మ బాబూ ఖర్మ.

* * *

'ఏయ్'

'......'

'ఇదుగో, నిన్నే'

'.......'

'మాట. ఇట్లారా. బాబూ!

'.......'

'ఒక్కమాటవినిపో. ఇదిగో. ఈ పదిరూపాయలూ నీకుఇస్తాను. త్వరగా రా బాబూ! నామాట వినవూ?'

* * *

'ఎవరదీ?'

'.......'

'నన్నేనా, పిలుస్తూంటా! అవునూ. నన్నే.'

'.......'

'ఏమిటబ్బా మాట అంటున్నాడూ!? తెగ సంపాదించి బొజ్జ పెంచుకున్న ఆ సిల్కులాల్చీ, వుంగరాల పెద్దమనిషికి తనతో ఏం పని చెప్మా?'

'.......'

'పది రూపాయలిస్తానంటున్నాడే! ఎంత మంచి పెద్దమనిషీ!'

* * *

'చూడుబాబూ! ఈ వీధిచివర డాక్టర్ బొజ్జయ్యా వుంటారు. నువ్వు అక్కడికి వెళ్ళి ఆయన్ని పిల్చుకొస్తివా, ఈ పది రూపాయలూ నీకే ఇచ్చేస్తాను. ఏం? వెళ్ళి పిల్చుకుని వస్తావా? అబ్బ! అమ్మ! అయ్య! అయ్యో! ఇక్కడ ఒక పెద్ద మనిషికి ప్రాణం మీదికి వచ్చిందని చెప్పి పిల్చుకురా.'

'.......'

'ఏం నాయనా! నువ్వు మంచి వాడివిగదూ! వెళ్ళవూ! వెళ్ళి ఆ డాక్టర్ని వెంటనే పిల్చుకుని రావూ! సాటి మనిషిమీద నీకు ఆ మాత్రం జాలిలేదూ! ఇదుగో. ఈ పదిరూపాయలూ తీసుకో. నీకే.'

అబ్బయ్య తల పైకీ క్రిందికీ వూపి, వెనక్కి తిరిగి పరుగు లంకించుకున్నాడు. వూపిరి బిగపట్టి మండుతూవున్న నిప్పులమీద పరుగెత్తే శూరుడిలాగా, వీరుడివలే, దవుడు తీసాడు.

* * *

'ట్రింగ్. ట్రింగ్'

'ట్రింగ్. ట్రింగ్'

'ట్రింగ్. ట్రింగ్'

ఎయిర్కండిషనర్ ఆగిపోగా ఆ వుక్కకి తట్టుకోలేక, బట్టలన్నీ విడిచి, తడి తువ్వాలు నడుంకి చుట్టుకొని, బాత్‌రూంలో టబ్ దగ్గర కూర్చుని అయాసపడ్తూవున్న, డాక్టర్ బొజ్జయ్యా చిటపట్లాడ్తూ వచ్చి తలుపుదీసాడు.

ఎదురుగా, మాసిన జుత్తుతో, వొంటిమీద జీరాడ్తున్న గుడ్డ పీలికలతో, వెన్నుకి అంటుకుపోయిన కడుపుతో. ఎర్రగా జ్యోతుల్లా అయిన కళ్ళతో నిలబడివున్న అబ్బయ్యగాడ్ని చూసి, కళ్ళెర్రజేసి—

'ఎవర్రా నువ్వూ! ఫో. ఫో' అని అరిచాడు, చిరాగ్గా.

అబ్బయ్య నోరుతెరిచి ఏదో చెప్పటాన్కి ప్రయత్నించాడు.

'పోలీసుల్ని పిలిచి బొక్కలో తోయిస్తాను. నీ అమ్మాబాబులు జ్ఞాపకం వచ్చేలాగా, ఎముకలు నలగ బొడిపిస్తాను. దొంగరాస్కెల్. ఫో. పోరాఫో' అంటూ కర్రతీసుకుని మీదిమీదికి వస్తూ— బొజ్జయ్యా—

'టామీ! కమాన్. టామీ. కాచ్ దిస్ రెబెల్ ఫెలో', అంటూ, అల్సేషియన్‌ని పిలిచాడు. ప్రళయ భీకరంగా పళ్ళు బయటపెట్టి, గర్జిస్తూ ఇంట్లోనించి బయటకి వస్తూవున్న, ఆ విశ్వాసంగల జంతువుని గమనించి, ప్రాణభయంతో వెనుదిరిగి, పెనంలాగా కాల్తువున్న రోడ్డెక్కి, మిల్కాసింగ్‌ని తల్చుకున్నాడు అబ్బయ్యగాడు, అర్భకుడు!

రొప్పుతూ రోజుతూ—

చమట్లు కారుస్తూ—

ఆయాసంతో వూగిపోతూ—

భయంకరమయిన పొగలూసెగలూకక్కే ఆ ఎండని చీల్చుకుంటూ కోటీశ్వరావు మేడదగ్గరకి వచ్చిపడిన అబ్బయ్యగాడికి—

అక్కడ వరండాలో, క్రిందపడి—దిక్కూ మొక్కూ లేనట్లుగా—పక్షిలాగా—గిలగిలా కొట్టుకుంటూ, హృదయ విదారకంగా మూల్గుతూ, మృత్యుదేవత కౌగిలిని తప్పించుకొనటానికి విశ్వప్రయత్నం చేస్తూ, వోడిపోయే దశలోవున్న కోటేశ్వరావుని చూస్తూ—

శోకనివూపుతూ, అసహాయంగా నిలబడి, కళ్ళవెంట ధారాపాతంగా నీరు కార్చుతూవున్న ఆ గజ్జికుక్క కనపడింది. దాని నడుం మీద ఎర్రగా ఆ గాయం! అవతలి వ్యక్తి బాధని చూడలేక, తన నొప్పిని కూడా మరిచి, కన్నీరు పెట్తున్న పిచ్చ జీవి! ఫూలిష్ ఫెలో!

అప్రయత్నంగానే, అబ్బయ్యగాడి కళ్ళూ చెలమలయ్యాయి. తనకి ఏం చెయ్యటానికి దిక్కుతోచక భోరుమని ఏడ్చాడు, ఫూల్ అబ్బయ్య.

ఎండ పేల్చేస్తోంది.

ఎండ దంచేస్తోంది.

ఎండ వాయించేస్తూవుంది. అప్పుడు ఆఖరిసారిగా—ఆయొక్క జీవుడు గిలగిలలాడాడు.